క్లుప్తంగా

ఘనంగా గంగానమ్మ జాతర



జమీదగ్గుమిల్లి(పామర్రు): మండలంలోని జమీ దగ్గుమిల్లిలోని రజకుల ఆధ్వర్యంలో గంగానమ్మ జాతర మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని గంగానమ్మ అమ్మవారికి 108 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. అనంతరం పసుపు కుంకుమలను సమర్పించారు. నూతన వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం స్థానిక రజక వాడ నుంచి గ్రామంలోని పురవీదుల వెంబడి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకుని భక్తులు తమ మొక్కలను తీర్చుకున్నారు.

ద్విచక్ర వాహనచోదకుడికి గాయాలు

బంటుమిల్లి: ఆర్తమూరు గ్రామం వద్ద 216 జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. బంటుమిల్లి వైపు నుంచి ఆర్తమూరు వస్తున్న ద్విచక్ర వాహనచోదకుడు హఠాత్తుగా మలుపు తిప్పడంతో మచిలీపట్నం నుంచి భీమవరం వెళ్తున్న కారు ఢీ కొట్టింది. ఘటనలో ద్విచక్ర వాహనచోదకుడు గాయపడటంతో మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అనాలోచిత నిర్ణయాలతో సమస్యలు

మచిలీపట్నంటౌన్: అనాలోచిత నిర్ణయాలతో ప్రతి ఒక్కరూ ఇబ్బంది పడాల్సి వస్తోందని దైవసేవకుడు బ్రదర్ జాన్‌డానియల్ అన్నారు. మల్కాపట్నంలోని ఎల్‌ఈఎఫ్ చర్చిలోమూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రీస్తు సువార్త సభలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఆయన మాట్లాడుతూ ఏసు మార్గంలో పయనించాలన్నారు. కాకినాడకు చెందిన దైవసేవకులు బ్రదర్ సత్యం, ఎల్‌ఈఎఫ్ చర్చి పాస్టర్ తంటెపూడి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు

బంటుమిల్లి: మండలంలోని ములపర్రు, జానకిరామపురం గ్రామాల్లో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని రెండు రోజులు పాటు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. వీటిని సీపీఎం అనుబంధ మహిళా సంఘం ఐద్వా ఆధ్వర్యంలో నిర్వహించారు. విజేతలకు ఆయా గ్రామాలకు చెందిన దాతలు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచి బొడ్డు మంగమ్మ, మహిళా సంఘ సభ్యులు ఎం.పద్మ, ఎల్.సుజాత, పి.ధనశ్రీ, సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, అజయ్‌ఘోష్ పాల్గొన్నారు.

ముగిసిన ఖోఖో పోటీలు



బంటుమిల్లి: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా మండల స్థాయిలో ఖోఖో పోటీలు రసవత్తరంగా జరిగాయి. బంటుమిల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పెద తుమ్మిడి జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో మంగళవారం మండల స్థాయిలో ఖోఖో పోటీలు నిర్వహించారు. వీటిలో పెద తుమ్మిడి సచివాలయం స్థాయిలోని మహిళలు, పురుషులు జట్లు పెడన నియోజకవర్గ స్థాయిలో ఆడటానికి ఎంపికయ్యాయి.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): షష్ఠిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో మంగళవారం సుబ్రమ్మణ్య స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి ఆలయ అర్చకులు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని స్వామి వారి ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా కల్యాణ వేదిక వద్దకు తీసుకురాగా, ఆలయ అర్చకులు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం ఉభయదాతలు, ఆలయ అర్చకులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని జరిపించగా, పెద్ద ఎత్తున భక్తులు వీక్షించారు. షష్ఠి, మంగళవారం కలిసి రావడంతో స్వామి వారి కల్యాణోత్సవాన్ని వీక్షించడం అదృష్టంగా భావిస్తున్నామని పలువురు భక్తులు పేర్కొన్నారు. కల్యాణోత్సవం తర్వాత భక్తులకు తలంబ్రాలను పంపిణీ చేశారు. అనంతరం స్వామి వారి ఊరేగింపులో అర్చకులు, ఆలయ అధికారులు, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు



పెనమకూరులో ఆకట్టుకున్న ముగ్గు

తోట్లవల్లూరు: సంక్రాంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే పిల్లలు, పెద్దలు పవిత్ర స్నానాలాచరించి నూతనవస్త్రాలను ధరించి పండగ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పండుగ రోజు పూలు, పండ్లు, ప్రత్యేకంగా తయారు చేసిన పిండివంటలతో మహిళలు పూజలు నిర్వహించారు. కొత్త అల్లుళ్లు, బంధుమిత్రులు, కుటుంబసభ్యులతో పండగ మూడు రోజులు ఆహ్లాదంగా గడిపారు. తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, గరికపర్రు గ్రామాల్లో నిర్వహించిన కోడిపందేలను ప్రజలు పెద్ద ఎత్తున తిలకించారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సాహాలతో సంక్రాంతి పండగను జరుపుకున్నారు. సంక్రాంతి సందర్భంగా సోమవారం గ్రామాల్లో ఇళ్లన్నీ కళకళలాడాయి. రకరకాల పిండి వంటలు, కొత్త అల్లుళ్లు, బంధువుల సందడితో పండగను ఉత్సాహంగా జరుపుకున్నారు.

మంగళవారం కనుమ పండగ సందర్భంగా ఆలయాలకు వెళ్లి సంవత్సరమంతా ఉత్సాహంగా ఉండేవిధంగా ఆశీర్వదించాలని దేవుళ్లకు పూజలు చేశారు.

ముగ్గుల పోటీలు

తోట్లవల్లూరు: పెనమకూరులో భారత యువజన సంఘం ఆధ్వర్యంలో పిల్లలకు పరుగు పందెం, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, మహిళలకు ముగ్గుల పోటీలు ఉత్సాహంగా సాగాయి.

విజేతలకు సోమవారం రాత్రి ఎంపీటీసీ సభ్యుడు మరీదు వెంకట శివమధుబాబు, మాజీ సర్పంచ్ మరీదు నాగేశ్వరరావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ చాగంటిపాటి సునీత, పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శ్రీనివాసరావు, మరీదు లక్ష్మయ్య, యూత్ ప్రతినిధులు మధుసూధనరావు, యోహాను, శ్రీనివాసరావు, సాయికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సొంతూరులో ఐజీ రామకృష్ణ సందడి



ఐజీ రామకృష్ణకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్, పోలీసులు

కైకలూరు: ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ ఆఫ్ పోలీసు(ఐజీ) ఏసీబీ పీహెచ్‌డీ రామకృష్ణ కుటుంబ సమేతంగా సంక్రాంతి సందర్భంగా సొంతూరు కైకలూరులో సోమవారం సందడి చేశారు. స్థానిక బృందావనం గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో స్నేహితుడి ఇంటికి కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎంపీపీ అడవి కృష్ణ, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, కైకలూరు సర్కిల్, టౌన్ సీఐలు బి.కృష్ణకుమార్, ఆకుల రఘు మర్యాదపూర్వకంగా కలుసుకుని ఐజీకి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఐజీ కుటుంబం దొడ్డిపట్లలో సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం, సర్వాయిపాలెం రామాలయాన్ని సందర్శించుకున్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు దీక్షితులు, గురజాడ ఉదయశంకర్, తెలగంశెట్టి శ్రీనివాసరావు, పెనుమూడి నాగరాజు, బొర్రా శ్యామ్‌సుందర్, మద్దూరి ప్రసాద్, బందా నారాయణ, అడవి శివప్రసాద్ పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు చాట్ల శిఖామణికి ఘన నివాళి

పామర్రు: సీపీఎం నాయకుడు చాట్ల శిఖామణి వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక చాట్ల వానిపురలో మంగళవారం నిర్వహించారు. తొలుత శిఖామణి స్థూపం వద్ద ఆయన చిత్ర పటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి ఘనగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. 33 మంది మహిళలు ఈ పోటీలో పాల్గొన్నారు. విజేతలకు ప్రముఖ వైద్యులు సురేష్‌చంద్రారెడ్డి బహుమతులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిఖామణి సీపీఎం పామర్రు పట్టణ కార్యదర్శిగా 40 ఏళ్లు పాటు ఎనలేని సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి చాట్ల రాంబాబు, వేము పెదబాబు, ఆర్ వెంకటేశ్వరరావు, చాట్ల రమేష్, జువ్వనపూడి రామస్వామి, కె.లక్ష్మణ, చాట్ల శ్రీనివాసరావు, ఆదిశేషు, కె.రాఘవ, గంగాధర ప్రసాద్, రఘునాధరావు పాల్గొన్నారు.

హిందూ ధర్మసమితి ఆధ్వర్యంలో బెంచీల ఏర్పాటు

మండవల్లి: సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని హిందూ ధర్మ సమితి ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్లలో ప్రజలు కూర్చోనేందుకు వీలుగా మంగళవారం బెంచీలు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో 4, మండవల్లి, భైరవపట్నం, అప్పాపురం గ్రామాల్లోని శివాలయాల్లో 3 మొత్తం ఏడు బెంచీలను ఏర్పాటు చేశారు.

బందరుపోర్టు వద్ద సందర్శకుల సందడి

మచిలీపట్నంటౌన్: బందరు సముద్రతీరంలో శరవేగంగా జరుగుతున్న పోర్టు పనులను తిలకించేందుకు సందర్శకుల తాకిడి అధికమైంది. సంక్రాంతి పండుగ సందర్భంగా వివిధ ప్రాంతాల్లో నివసిస్తున్న బందరు ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల వారు పోర్టు పనులు చూసేందుకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. పెద్ద ఎత్తున పనులు జరుగుతుంటే ప్రతిపక్ష పార్టీల నాయకులు చేస్తున్న విమర్శలు విడ్డూరంగా ఉన్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విశ్వసనీయత ఉన్న నాయకుడని ఈపోర్టు పనులతో పాటు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చటాన్ని చూస్తుంటేనే అర్థమవుతోందని చెబుతున్నారు.

మకరజ్యోతి దర్శనం.. పులకించిన భక్తజనం..



రాజకుమారుడిగా అయ్యప్ప మూలవిరాట్



చల్లపల్లిలో అయ్యప్ప నగలు ఊరేగింపు నిర్వహిస్తున్న పాండురంగ గురుస్వామి



ఆలయంపై వెలుగుతున్న మకరజ్యోతి

కోడూరు : కేరళ తరహా డప్పువాయిద్యాలు.. మేళతాళాలు.. పూలపరిమళాలు.. బాణాసంచా వెలుగుల మధ్య అయ్యప్పస్వామి మకరజ్యోతి దర్శనంతో భక్తజనం పులకించారు. అపర శబరిమలగా పేరుగాంచిన కోడూరు అయ్యప్ప దేవాలయంలో సోమవారం రాత్రి మకరజ్యోతి దర్శన కార్యక్రమాన్ని జరిగింది. ఉదయం అయ్యప్ప మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలను చేశారు. సాయంత్రం స్వామివారి నగల ఊరేగింపు కార్యక్రమాన్ని ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త బడే భావన్నారాయణ ఇంటి నుంచి ప్రారంభించారు. స్థానిక శివాలయంలో పూజలనంతరం భావన్నారాయణ నగల పెట్టెతో పదునెట్టంబడిపై నడుచుకుంటూ వెళ్లి మూలవిరాట్‌కు ధరింపచేశారు.

ఆలయంపై జ్యోతి దర్శనం..

ఆలయ ప్రాంగణంలో పెద్దమొత్తంలో కర్పూరాన్ని జ్యోతిగా వెలిగించి భక్తులకు దర్శనమందించారు. 19 ఏళ్ల నుంచి ఏటా ఇదే తరహాలో జ్యోతి దర్శనం కల్పిస్తున్నట్లు భావన్నారాయణ చెప్పారు. పంబల రాజుగా, మాలికాపురోత్తమ అమ్మవారి పుట్టింటివారిగా గ్రామ ప్రముఖులు వ్యవహరించి స్వామివారి వివాహ రాయబారోత్సవాన్ని భక్తిప్రపత్తులతో జరిపారు. హరిహరసుతుడుని రాజకుమారుడిగా అలంకరించారు. ప్రధానార్చకుడు కొమ్మూరి శ్రీనివాసశర్మ పర్యవేక్షణలో ఉత్సవాలు జరగ్గా, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మచిలీపట్నంటౌన్: నగరంలోని గాంధీబొమ్మ శివాలయం ఆవరణలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం వద్ద సోమవారం రాత్రి జ్యోతి దర్శనం జరిగింది. శబరిమలలో మకరజ్యోతి దర్శనం అనంతరం ఆలయంలో జ్యోతిని వెలిగించగా భక్తులు తిలకించారు. ఈ సందర్భంగా స్వామివారికి పూజారులు బంగారు పుష్పాలతో పూజలు చేశారు. ఉదయం సహస్రమోదక శ్రీ లక్ష్మీ గణపతి హోమం, సాయంత్రం ఆభరణాల ఊరేగింపు నిర్వహించారు.

చల్లపల్లి: స్థానిక నిమ్మలతోటలోని శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి క్షేత్రంలో మకర జ్యోతి దర్శనం వైభవంగా జరిగింది. సాయంత్రం ఆలయ వ్యవస్థాపకుడు అన్నవరపు పాండురంగారావు గురుస్వామి ఇంటి వద్ద నుంచి అయ్యప్ప నగల ఊరేగింపు ఘనంగా జరిగింది.

వృద్ధురాలి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో వృద్ధురాలు అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన పి.వెంకటరమణ, భర్త ఫణికుమార్ కుటంబ సభ్యులతో కలిసి ఉంటున్నారు. ఆమె తల్లి పసుపులేటి విజయలక్ష్మి(55) అదే గ్రామంలో వెంకటరమణ ఇంటి సమీపంలో ఉంటుంది. వెంకటరమణ, ఆమె భర్త ఆఫీసుకు వెళ్లిన సమయంలో వారి మూడేళ్ల కుమారుడిని తల్లి విజయలక్ష్మి చూస్తుంది. కాగా ఈ నెల 13న విజయలక్ష్మి రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

వేణుగోపాలునికి ప్రత్యేక సేవలు



పెడన: స్థానిక శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ఊంజల సేవ జరిగింది. ధనుర్మాసం ముగింపు సందర్భంగా సోమవారం రాత్రి స్వామివారికి ఊంజల సేవ నిర్వహించారు. పండితులు పరాసం కృష్ణప్రసాద్, అగ్నిహోత్రం హరికృష్ణ, కృష్ణామాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గో పూజోత్సవం

గూడూరు: కనుమ పర్వదినం పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన మంగళవారం తరకటూరుపాలెంలో గో పూజోత్సవం నిర్వహించారు. 'మనగుడి'లో భాగంగా కమ్మిల పోతురాజు గోశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధి శ్రీమాన్ బృందావనం దాసు ముఖ్యఅతిథిగా పాల్గొని గో-మహత్యం, గో-పెంపకంతో రైతులకు కలిగే ప్రయోజనాలను భక్తులకు వివరించారు. టీటీడీ హిందూ ధర్మ పరిషత్ ప్రతినిధి తురగా ప్రసాద్, గోశాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

కోడూరు: పాడిపంటలను అందిస్తున్న గోవులకు రైతులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని లింగారెడ్డిపాలెంలో ఆచారం ప్రకారం మంగళవారం పొలాల్లో గోవుల పండుగను జరిపారు. గ్రామంలోని రామాలయం వద్ద నుంచి అలంకరించిన ఎడ్లబండిపై సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి విగ్రహాలను గ్రా మంలో ఊరేగింపుగా పొలాల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ అన్నదాతలు కట్టెల పొయ్యిపై పొంగలి తయారు చేసి స్వామివారి పూజలు చేశారు. కోడూరు శివరామకృష్ణ క్షేత్రంలో గోవులకు ప్రత్యేక పూజలు జరిగాయి.

ఆంజనేయుడికి 1008 అరిసెలతో పూజలు



నగరంలోని ఈడేపల్లి ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి 1008 అరిసెలు సమర్పించి పూజలు చేశారు. స్వామివారిని చెరకు గడలు, తులసి, పూలమాలలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



మచిలీపట్నం టౌన్: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా నగరంలో మంగళవారం క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక నోబుల్ కళాశాల, ఆంధ్రజాతీయ కళాశాల క్రీడామైదానంలో జరిగిన పోటీల్లో పలు డివిజన్ల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నోబుల్ కళాశాలలో -4, ఆంధ్ర జాతీయ కళాశాలలో -4 జట్లు క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాయి. నోబుల్ కళాశాల క్రీడామైదానంలో -4 వాలీబాల్, మూడు ఖోఖో, మూడు కబడ్డీ మ్యాచ్‌లు జరిగాయి. ఆంధ్ర జాతీయ కళాశాలలో జరిగిన పోటీలకు 28వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ షేక్ మొహమ్మద్‌సాహెబ్ హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు.

ప్రజల జీవితాల్లో నూతనకాంతులు



బ్రాహ్మణుల ఆశీర్వచనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



గోమాతకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: సంక్రాంతి పండగ ప్రజల జీవితాల్లో నూతన కాంతులను నింపాలని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక శాసన సభ్యుల నివాసంలో సోమవారం సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మకరరాశిలోకి సూర్య భగవానుడి ప్రవేశంలో ప్రారంభమయ్యే ఉత్తరాయణ పుణ్యకాల శుభ సమయాన ప్రజలు సిరిసంపదలతో తులతూగాలని అన్నారు. ప్రతి కుటుంబంలో ఆనందోత్సహాలు వెల్లి విరియాలన్నారు. పాడి పంటలతో పచ్చని పైర్లతో పల్లెలు కళ కళలాడాలని పేర్కొన్నారు. తొలుత సంక్రాంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే కార్యాలయం ముందు రకరకాల ముగ్గులతో అలంకరించారు. సన్నాయి మేళాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. వేద పండితులు ఎమ్మెల్యే వేద మంత్రాలతో ఆశీర్వదించారు. గంగిరెద్దుల ఆటలతో, హరిదాసుల నామ కీర్తనలతో కార్యాలయం మార్మోగింది. అనంతరం ఎమ్మెల్యే గోమాతకు విశేష పూజలు చేశారు. బ్రాహ్మణలకు నూతన వస్త్రాలను మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు కె స్వరూపరాణి, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఏ రమాదేవి, ఎంపీటీసీ పీ రత్నకుమారి, టీ శ్రీనివాసరావు, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల సచివాలయాల అధ్యక్షులు ముప్పిడి సురేష్‌రెడ్డి, కో ఆప్షన్స్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, పీఏసీఎస్ అధ్యక్షుడు బలుసు హరికిరణ, మురళీ, ఎస్.రామచంద్రరరావు, ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, ఉండ్రపూడి వీరాంజనేయస్వామి ఆలయ డైరెక్టర్ డీడీప్రసాద్, కె రాణి, పామర్రు ఏఎంసీ డైరెక్టర్ కూసం పెద వెంకటరెడ్డి, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, మద్దుల సుబ్రమణ్యం,కైలే సభకీర్తి, ఆరేపల్లి శ్రీహరి పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణోత్సవం



తోట్లవల్లూరులో గోదాదేవి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



గుడివాడంలో గోదాదావి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. ధనుర్మాస ఉత్సవాల ముగింపులో భాగంగా ఆలయంలో గోదా, రంగనాథుడి కల్యాణాన్ని ఆలయ అర్చకులు వేడుకగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరిదుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక వాసవీచౌక్‌లోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం గోదాదేవి అమ్మవారి కల్యాణం వైభవంగా జరిగింది. అమ్మవారిని నగర సంకీర్తన గావించి పెండ్లికుమార్తెగా అలంకరించారు. ఈ సందర్భంగా వేదపండితులు మాట్లాడుతూ గోదాదేవి రంగనాథుని వివాహమాడ తలంచి వారిపై ఉన్న భక్తితో అనేక పద్యాలు రచించి గ్రామ ప్రజలను తోడుతీసుకుని రంగనాథుని ఆలయంలో చేరి స్వామికి రోజుకు ఒక పద్యాన్ని వినిపిస్తూ స్వామిలో గోదాదేవి లీనమైపోయిందన్నారు. దీనిని పురస్కరించుకుని అమ్మవారి కల్యాణం నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి అధ్యక్షుడు జవ్వాజి గంగరాజు, అదనపు కార్యదర్శి సముద్రాల వెంకట జగ్గారావు, కోశాధికారి గోపాలకృష్ణ మూర్తి, ప్రముఖులు పోకూరి మోహనరావు, శేగు వెంకట రామారావు, చిన్నం గంగాధర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో పలువురికి గాయాలు

పెనమలూరు: పెనమలూరు పరిధిలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. గంగూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవ్వటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడపకు చెందిన గంధం సాంబశివరావు ఈ నెల 14న తన అత్తగారి ఊరు గడ్డిపాడుకు బైక్‌పై వెళ్లి రాత్రి తిరిగి బయలుదేరాడు. అతను బైక్ వెనుక వేమనాథ్ కూర్చున్నాడు. వీరు గంగూరు వద్దకు వచ్చిన తరువాత రోడ్డు పక్కన ఆగి ఉన్న కారును వెనుక నుంచి ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. బాధితుడి బంధువు బోయిన నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో..

పెదపులిపాక చిన్నకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అయ్యప్పనగర్‌కు చెందిన మీర్‌కర్ధంసాహెబ్(60) బైక్ పై సోమవారం పెదపులిపాక కట్టపై వెళ్తుండగా అతనిని ఎదురుగా వచ్చిన బైక్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతని కాలికి గాయమైంది. ఈ ఘటనపై బాధితుడి కుమారుడు షేక్ మహబూబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని మ్యాంగో మార్కెట్‌లో సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇగుటూరి శ్రీనివాసరెడ్డికి చెందిన మామిడికాయల షాపు కాలిపోయింది. సంక్రాంతి పండుగ కావడంతో షాపు వద్ద ఉండవలసిన వారు ఎవ్వరూ లేకపోవడంతో మంటలకు షాపు పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది. సమీపంలోని వారు మంటలను గమనించి పాయకాపురంలోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్.రమేష్ సిబ్బంది అక్కడకు వచ్చి మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో జనరేటర్, మామిడికాయల ట్రేలు, షెడ్డు పూర్తిగా కాలిపోయినట్టు అగ్నిమాపక కేంద్రం అధికారి ఎస్.రమేష్ తెలిపారు. ఈ ప్రమాదంలో 5 లక్షల రూపాయల నష్టం సంభవించిందన్నారు.

క్రీడాకారుల సంక్షేమానికి కృషి



కంకిపాడు: క్రీడాకారుల సంక్షేమానికి కృషి చేస్తానని రక్ష ఫౌండేషన్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. వాలీబాల్ క్రీడాకారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. స్నిగ్ధ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, ఆరోగ్యం లభిస్తాయన్నారు. ఆసక్తిగల రంగాలను ఎంచుకుని ప్రతిభ చాటాలని సూచించారు. క్రీడాకారిణిగా క్రీడల పట్ల ఉన్న ఆసక్తితో క్రీడాకారుల సంక్షేమానికి పాటుపడతానన్నారు. పాఠశాల క్రీడా మైదానంలో వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని చెప్పారు. జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. ట్రాక్, జిమ్ ఏర్పాటుతో క్రీడాభివృద్ధి సాధ్యమవుతుందని, ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు. క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యతను పాఠశాల పీఈటీ రమేష్ వివరించారు.